మొదటి అలైన్‌మెంట్ ప్రకారమే త్రిపుల్‌ఆర్ భూసేకరణ చేపట్టాలి

- పవర్‌లూమ్ కార్మికులను ఆదుకోవాలి
- జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి
- సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఎం ప్రతినిధి బృందం వినతి

సిఎం రేవంత్‌కు వినతి పత్రం అందజేస్తున్న బివి రాఘవులు, ఎస్ వీరయ్య, చెరుపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
చౌటుప్పల్ ప్రాంతంలో త్రిపుల్‌ఆర్ భూసేకరణలో భూమిని కోల్పోతున్నామంటూ పలువురు బాధితులు ఆందోళన చెందుతున్నారని సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. మొదటి అలైన్‌మెంట్ ప్రకారమే త్రిపుల్‌ఆర్ భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి కలిసి వినతిపత్రాలను సమర్పించారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముందుగా నిర్ణయించిన అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం మార్చడం వల్ల మధ్యతరగతి ఉద్యోగులు, రైతులు, పేదలు నష్టపోతున్నారని తెలిపారు. ముందు నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారం భూసేకరణ చేపడితే ఎవరికీ అభ్యంతరం లేదనీ, నష్టం ఉండబోదని పేర్కొన్నారు. ముందు నిర్ణయించిన ప్రకారమే ప్రభుత్వం ముందుకు పోవాలని కోరారు. ఇప్పటికే త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పుపై నిర్ణయం జరిగిపోయిందనీ, వెనక్కి వెళ్లడం కష్టమనీ, బాధితులకు నష్టపరిహారం పెంచే ప్రయత్నాం చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని వివరించారు. సిరిసిల్లలో 30 వేల మంది పవర్‌లూమ్ కార్మికులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. పవర్‌లూమ్‌ల కరెంటు చార్జీలను ప్రభుత్వం రూ.రెండు నుంచి రూ.10 లకు పెంచిందని వివరించారు. పదేండ్ల నుంచి బకాయిలు కట్టాలంటున్నారని పేర్కొన్నారు. దానివల్ల పవర్‌లూమ్‌లు మూతపడ్డాయనీ, 30 వేల మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. పవర్‌లూమ్‌లకు కరెంట్ రాయితీని కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలోలాగా యూనిట్‌కు రూ.రెండు వసూలు చేయాలని కోరారు. పవర్‌లూమ్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో హన్మకొండ జిల్లా కాకతీయ విశ్వవిద్యాలయానికి ఆనుకుని టీచర్లు, కాంట్రాక్టు కార్మికులు, ఆటో డ్రైవర్లు 40 ఏళ్లుగా నివసిస్తున్నారని తెలిపారు. అది కాకతీయ వర్సిటీకి సంబంధించిన స్థలమనే పేరుతో ఆ ఇండ్లను కూలుస్తామంటూ మున్సిపల్ అధికారులు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఇది వారి ప్రయివేటు స్థలమనీ, వర్సిటీకి సంబంధం లేదని తెలిపారు. కాబట్టి సాధారణ ఉద్యోగులు, కార్మికుల ఇండ్లను కూల్చొద్దనీ, వాటిని పరిరక్షించాలని కోరారు. మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల సమక్షంలో ఈ సమస్యను పరిశీలిస్తామంటూ సిఎం హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొంత మంది జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, దాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అయితే కొంత మంది సీనియర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు రావడంలేదని తెలిపారు. ప్రభుత్వం ఒక సొసైటీకి భూమి ఇచ్చిందని వివరించారు. ఆ సొసైటీలో లేని సీనియర్ జర్నలిస్టులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీనియర్లు నష్టపోకుండా తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జూబ్లీహిల్స్ సొసైటీలో ఎక్కువ మంది సీనియర్లున్నారని వివరించారు. ప్రభుత్వం ఇచ్చే ఇండ్ల స్థలాల్లో ఏ సొసైటీలో ఉన్నా సీనియర్ జర్నలిస్టులకు భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్లకు నష్టం జరగకుండా చూడాలని తెలిపారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఆ సమస్యను పరిశీలించాలంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సిఎం కోరారు.

గురువులు సామాజిక శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - కల్చరల్
గురువులు బాధ్యత విస్తృతం అని, కేవలం తరగతి గదిలో పాఠాలు చెప్పటంతో సరిపోదని కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. గురువులు పిల్లలకు నైతిక విలువలు కుటుంబ సంబంధాలు సత్ప్రవర్తన నేర్పాలని వారు సమాజిక శాస్త్రవేత్తలు అని అయన చెప్పారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురు సత్కారం పురస్కార ప్రదాన సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వేణుగోపాలాచారి పలువురు నాట్య సంగీత గురువులకు గురు రత్న పురస్కారాలు బాల కళాకారులకు అభ్యుదయ పురస్కారాలు బహుకరించారు. దాదాపు మూడేళ్ళ బాల కళాకారుల నుంచి పదునాలుగు సంవత్సరాలు వయస్సు కళ యువ కళా కారుల వరకు దాదాపు వంద మంది పైగా తమ నాట్య సంగీత ప్రదర్శనలతో కను విందు చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో భారత్ వరల్డ్ రికార్డ్స్ రమణారావు అధ్యక్షత వహించిన సభలో నాట్య గురువులు పి శేషుబాబు డాక్టర్ పి రమాదేవి, నటుడు విక్రమాదిత్య, పద్మావతి పాల్గొనగా రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కె సుజాత పాల్గొని మాట్లాడుతూ భారత్ ఆర్ట్స్ అకాడమీ భారతీయ సంస్కృతి సంపద ఇన శాస్త్రీయ కళల పెంపునకు తమ వంతు కృషి చేస్తున్నారని అభినందించారు. సంస్థ అధ్యక్షురాలు లలిత రావు కార్యక్రమ నిర్వహణ చేశారు.

రికార్డ్ నమోదు చేసుకున్న స్వర వీణా పాణి రచనల బృందగానం

ప్రజాశక్తి కల్చరల్ : ప్రముఖ సినీ సంగీత దర్శకుడు స్వర వీణాపాణి స్వర రచన చేసిన 72 మేళ కర్త రాగాల స్వర కామాక్షి స్వర బీజాక్షరి కీర్తనలు 72 మందితో 36 నిమిషాలలో అన్నమయ్య కళా సమితి (నక్రీకల్) స్వర నిధి నిర్వహణలో బృందగానం చేసి తెలుగు బుక్ రికార్డ్స్ లో నమోదు చేసుకున్నారు అని రికార్డ్ జూరీ సభ్యుడు అశోక్ కుమార్ ప్రకటించారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా బృంద గానంలో పాల్గొన్నారు .ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ రికార్డ్ నమోదు పత్రం సంస్థ నిర్వహకురాలు జి సుమలతకు అందజేసి మాట్లాడారు. సుమలత బాలలు యువతులకు స్వరాలు నేర్పి మహా విన్యాసం చేశారని ప్రశంసించారు. భారతీయ సంగీతం స్వరాలు మేళ కర్తల సమ్మేళనం అనీ లయ బద్ధ గానం కోసం ముఖ్య మన్నారు. స్వర వీణా పాణి అద్భుత సంగీత దర్శకుడు అని ప్రశంసించారు. వేదికపై వంశీ రామరాజు కవి అక్కిరాజు సుందర రామ కృష్ణ రవి వర్మ దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొనగా మాధవి వ్యాఖ్యానం చేశారు. అంతకు ముందు అన్నమయ్య కీర్తనలు గానం నత్య ప్రదర్శన జరిగాయి.

పిడుగుపడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగు పడి ఇద్దరు మహిళలు మృతిచెందిన ఘటనలు నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జిల్లాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం మమ్మాయిపల్లి గ్రామానికి చెందిన నక్క నీలమ్మ (40).. రోజు మాదిరిగానే ఆదివారం బర్రెలను మేపుకోవడానికి వెళ్లింది. ఆ సమయంలో ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగు పడి పడటంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెతో పాటు వెళ్లిన తన సోదరి నాగేంద్రమ్మ ఆ శబ్దానికి స్పృహ తప్పి పడిపోయింది. గమనించిన చుట్టుపక్కల వారు.. 108కు సమాచారం ఇవ్వగా.. నాగేంద్రమ్మను ఆస్పత్రికి తరలించారు.సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని న్యామతాబాద్ గ్రామానికి చెందిన బూచినేల్లి నాగమ్మ (41) శనివారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి బయల్దేరింది. అయితే అప్పటికే ఈదురుగాలులతో వర్షం మొదలు కాగా.. దారి మధ్యలో ఒక్కసారిగా మెరుపులు వచ్చి ఆమెపై పిడుగు పడింది. దాంతో నాగమ్మ అక్కడకక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే హద్నూర్ పోలీసులు ఏఎస్ఐ ఇక్బాల్, ఆర్ఐ శ్యామ్‌రావు, స్థానిక గ్రామస్తులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నాగమ్మ కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హద్నూర్ పోలీసులు తెలిపారు.

ప్రజలను ఏకతాటికి తీసుకొచ్చిన 'గద్దర్' గానాలు

- సంస్మరణ సభలో ప్రొ. కోదండ రామ్

గద్దర్, జహీరొద్దిన్ అలీ ఖాన్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ప్రొ. కోదండ రామ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ప్రజా కవి, యుద్ధ నౌక గద్దర్ పాడిన పాటలు ప్రజలను ఆలోచింపజేసి వారిని ఏకతాటికి తీసుకురావడంలో ముఖ్య భూమిక పోషించాయని ఎమ్మెల్సీ, టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండ రామ్ అన్నారు. ఆదివారం ఎస్‌టియు భవన్‌లో యుద్ధనౌక, ప్రజాకవి గద్దర్, సియాసత్ ఎడిటర్ జహీరొద్దిన్ అలీ ఖాన్ సంస్మరణ సభను నిర్వహించారు. దీనికి గద్దర్ కుమార్తె వెన్నెల, జహీరొద్దిన్ కుమారుడు ఫఖర్ అలీఖాన్‌తో కలిసి కోదండరామ్ హాజరయ్యారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కళాకారులు పాటలు పాడుతూ గద్దర్ గురించి తెలియజేశారు. గద్దర్ కుమార్తె వెన్నెల తన ప్రసంగం అనంతరం పాటలు పాడి ప్రజలను ఉత్సాహపరిచారు. అనంతరం కోదండ రామ్ మాట్లాడుతూ.. స్వరాష్ట్రం కోసం అన్ని వర్గాల వారిని మమేకం చేయడంలో గద్దర్ పాటలు ఎంతో దోహదం చేశాయని అన్నారు. తన కోసం కాకుండా ప్రజల కోసం పోరాటం చేసిన వ్యక్తులను సమాజం గుర్తించుకుంటుందన్నారు. ఆత్మగౌరవ తెలంగాణ పోరాటంతో పాటు బడుగు, బలహీన వర్గాల సమస్యలపై తన పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారని తెలిపారు. తల్లి నుంచి పాటలు నేర్చుకొని అనేక ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. గద్దర్ కుమార్తె వెన్నెల మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి కోసం.. వారిని చైతన్యపరడానికి తన తండ్రి పాటలు రచించి పాడారని అన్నారు. నీడని నమ్మని సమాజంలో జహీరొద్దిన్ అలీ ఖాన్‌ను గద్దర్ నమ్మేవారని గుర్తుచేశారు. ఇంటి నుంచి నిరుత్సాహంగా జహీరొద్దిన్ వద్దకు వెళ్లినా సంతోషంగా తిరిగి వచ్చేవారని తెలిపారు. ఇద్దరూ వేరే వేరే రంగాల్లో ఉన్నా వారిని కలిపింది ప్రజ సమస్యలేనని చెప్పారు. ప్రజల కోసం పాటల ద్వారా గద్దర్ ఉద్యమిస్తే, నిశ్శబ్దంగా వెనకనుంచి పేదలను, ఉద్యమకారులను జహీరొద్దిన్ అలీ ఖాన్ సహకారం ఇచ్చే వారని తెలిపారు. మహనీయుల ఆశయాలను కొనసాగించాలంటే చదువు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒయు జెఎసి నాయకులు మందల భాస్కర్, దరువు ఎల్లన్న, దుర్గం భాస్కర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, టిఎన్‌జిఓఎస్ అధ్యక్షులు అశోక్, సంస్మరణ సభ ఆహ్వాన కమిటీ సభ్యులు సొగల సుదర్శన్, అశోక్, పరమేశ్వర్, సత్యవాన్, అర్ఫత్ ఖాన్, ప్రశాంత్, నేతాకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో సిరిసిల్ల సెస్

- మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ బకాయిలు రూ.237 కోట్లు
- 14 ఏళ్లుగా చెల్లించని ప్రభుత్వాలు
- సెస్‌కు రావాల్సింది రూ.127 కోట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ బకాయిలు భారీగా పేరుకుపోయాయి. 14 ఏళ్లుగా ప్రభుత్వం చెల్లించని సబ్సిడీ మొత్తం రూ. 237 కోట్లకు చేరింది. ఈ భారీ మొత్తంలో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘానికి (సెస్) రావాల్సింది రూ. 127 కోట్లు కాగా, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు చెందినది రూ. 110 కోట్లు ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మరమగ్గాలకు 50 శాతం విద్యుత్ సబ్సిడీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అయితే ఆ సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించకపోగా నేటికీ బకాయిలు కుదిబండలా మారాయి. దాంతో ట్రాన్స్‌కోతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని సహకార విద్యుత్ సరఫరా సంఘానికి భారీ మొత్తంలో నష్టం వాటిల్లింది.

గ్రామీణ విద్యుద్దీకరణలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సిరిసిల్ల సెస్ 1970 నవంబర్ 1న ప్రారంభమైంది. అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావు చేతుల మీదుగా ఈ సంస్థ ఆవిర్భవించింది. ప్రారంభంలో 46 గ్రామాల్లోని 4,720 మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసిన సెస్, నేడు 2.72 లక్షల మందికి సేవలందిస్తోంది. ప్రస్తుతం సెస్ పరిధిలో సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాలున్నాయి. 13 మండలాల్లోని 255 గ్రామ పంచాయతీల్లో సేవలందిస్తోంది. కాగా, 2004 నుంచి 2009 వరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే 50 శాతం మరమగ్గాలకు విద్యుత్ సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేశారు. ఆ తర్వాత 2010లో రోశయ్య, అనంతరం కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో విద్యుత్ సబ్సిడీ నిధులు రాలేదు. 2014నుంచి 2023 వరకు తెలంగాణ రాష్ట్ర సమితి పరిపాలన సాగించినా, అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కూడా ఈ బకాయిలను చెల్లించలేకపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 10నెలలు గడిచినా ఈ విషయంలో చొరవ చూపలేదు.రాష్ట్రవ్యాప్తంగా 40వేల మరమగ్గాలు ఉండగా, ఒక్క సిరిసిల్ల జిల్లాలోనే 30వేల మరమగ్గాలు ఉన్నాయి. సిరిసిల్ల ప్రాంతంలో ట్రాన్స్‌కో కాకుండా సెస్ ఉండటంతో సంబంధిత సెస్‌కు రూ.97 కోట్లు మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ బకాయిలు రావాల్సి ఉండగా, రూ. 30 కోట్ల వరకు ఆ విద్యుత్ బకాయిలపై సర్‌చార్జీలు కూడా చేరాయి. సెస్ ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ కొనుగోలు చేసి ట్రాన్స్‌కోకు డబ్బులు చెల్లిస్తున్నది. అంతేకాకుండా విద్యుత్ బిల్లులు బకాయి పడితే సర్‌చార్జీలు కూడా చెల్లిస్తోంది. కానీ ప్రభుత్వాలు మాత్రం సెస్‌కు మరమగ్గాల 50శాతం విద్యుత్ సబ్సిడీ బకాయిలు చెల్లించడంలో వెనకడుగు వేస్తున్నాయి. దాంతో జిల్లాకు సంబంధించిన వినియోగదారుల డబ్బులతో నడుస్తున్న సెస్ అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంతోనే సెస్ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విద్యుత్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా బకాయిలో ఉన్న మరమగ్గాల 50 శాతం విద్యుత్ సబ్సిడీ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతాంగ సాయుధ పోరాటయోధుల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టించాలి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి వంటి యోధుల పేర్లు పోరాటంలో ముందు వరసలో ఉంటాయని పేర్కొన్నారు. వారితో పాటు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి విగ్రహాలు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. బొమ్మగాని ధర్మభిక్షం, ఆరుట్ల కమళాదేవి, మల్లు స్వరాజ్యం, భీరెడ్డి నర్సింహ్మారెడ్డి, నలమల్ల గిరిప్రసాద్, తదితరులు వారివారి ప్రాంతాలల్లో తగు గుర్తింపు ఉండేవిధంగా అయా జిల్లాల కూడలిలలో విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. సెప్టెంబర్ 17ను "ప్రజాపరిపాలన" పేరుకు బదులుగా "విలీన దినోత్సవం"గా జరపాలని సూచించారు. ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, కమ్యూనిస్టుల త్యాగాలు, కాంగ్రెస్, సోషలిస్టుల అగ్రనాయకుల త్యాగాలను భావితరాలకు తెలిపినట్టవుతుందని పేర్కొన్నారు.

ఏచూరి సేవలకు ముగింపు లేదు

- సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు
- సీతారాం.. కమ్యూనిస్టుల ఉమ్మడి ఆస్తి
- ఎమ్మెల్యే కూనంనేని, బి వెంకట్
- కొత్తగూడెంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ

సంస్మరణ సభలో మాట్లాడుతున్న పి మధు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికే కాక, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి సీతారాం ఏచూరి చేసిన సేవలకు ముగింపు లేదని మాజీ ఎంపి, సిపిఎం సీనియర్ నాయకులు పి మధు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని కమ్మ కళ్యాణ మండపంలో సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అధ్యక్షతన సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ముందుగా ఏచూరి చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు కాసాని ఐలయ్యతో పాటు మధు, కనకయ్య తదితరులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మధు మాట్లాడుతూ.. ఫెడరలిజంపై దాడి జరుగుతున్న నేపథ్యంలో సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి కాకుండా దేశానికే తీవ్రమైన నష్టమన్నారు. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం వెనకపట్టు పట్టిన సందర్భంలో కాంగ్రెస్ సీతారాం ఏచూరి బెంగాల్ కేంద్రంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల సదస్సు ఏర్పాటు చేసి కమ్యూనిజానికి మరణం లేదని చాటిచెప్పారు. దేశంలో కష్టజీవులు, కార్మికులు ఉన్నంత కాలం పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంత కాలం కమ్యూనిజానికి, సోషలిజానికి మరణం లేదని ఈ సదస్సు ద్వారా తెలియజేశారని గుర్తు చేశారు. పార్లమెంటులో అనేక రకాల సమస్యలపై ఇతర రాజకీయ పార్టీలు సైతం అంగీకరించే విధంగా కామ్రేడ్ ఏచూరి తన వాదనలను వినిపించేవారని అన్నారు. విద్యార్థి దశ నుండే కమ్యూనిస్టు రాజకీయాల్లోకి వచ్చిన ఏచూరి తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు పనిచేశారని, చివరకు తన దేహాన్ని సైతం వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం ఇవ్వడం కమ్యూనిస్టులకు ప్రజలపై ఉన్న అభిమానం, దేశం పట్ల బాధ్యత ఏంటో తెలియజేసిందని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడుతున్న సందర్భంలో కామ్రేడ్ ఏచూరి వేగుచుక్కలా కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో కృషి చేశారన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి ఉమ్మడి ఆస్తి అని స్పష్టంచేశారు. ఏచూరి మరణం భారతదేశానికి, వామపక్ష రాజకీయాలకు తీరని లోటన్నారు. తన మేధస్సుతో కమ్యూనిస్టు ఉద్యమాన్ని సైద్ధాంతికంగా నిలబెట్టిన ధీరుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. బతికున్నంత కాలం కమ్యూనిస్టు ఉద్యమానికి గౌరవ ప్రతిష్టలు అందించడమే కాకుండా ఆయన మరణం తర్వాత కూడా కమ్యూనిస్టు ఉద్యమానికి విశేషమైన గౌరవాన్ని అందించి వెళ్లిన కామ్రేడ్ సీతారాం ఏచూరి అజరామరుడని తెలిపారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమమే కాక, భారతదేశమే ఒక గొప్ప రత్నాన్ని కోల్పోయిందని తెలిపారు. భారత రాజ్యాంగ మూల స్తంభాలైన ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, ఫెడరలిజంపై దాడి జరుగుతున్న నేపథ్యంలో లౌకిక భావాలకు కట్టుబడి పనిచేసిన ఏచూరి.. లేకపోవడం దేశానికి తీరని లోటన్నారు. ఏచూరి స్ఫూర్తితో కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతానికి అంకితం అవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.షాబీర్‌పాష, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అవునూరి మధు, సిపిఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ మాస్‌లైన్ జిల్లా నాయకులు ముద్దా బిక్షం, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యాక్షులు బుగ్గవీటి సరళ, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, కోనేరు సత్యనారాయణ, టీజేఎంఎస్ నాయకులు మల్లెల రామనాథం మాట్లాడారు.

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా కోర్టు జడ్జి మరియు
ఫ్యామిలీ కోర్టు రంగారెడ్డి జిల్లా : కూకటిపల్లి
F.C.O.P. No. 2333/2018
బిట్వీన్ :-
జాలిగం రాములు S/o మైసయ్య ...పిటీషనర్
మరియు
జాలిగం లక్ష్మి W/o రాములు ...రెస్పాండెంట్
కోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రచురించు నోటీసు
టు
శ్రీమతి జాలిగం లక్ష్మి W/o రాములు
C/o ఉప్పరాపల్లి సత్తవ్వ
పెద సముద్రాల గ్రామం, కోయిడా మండలం, సిద్దిపేట జిల్లా
ఇందు మూలంగా పై రెస్పాండెంటుకు తెలియ చేయునది ఏమనగా పై పిటీషనరు మీ నుండివిడాకులు కోరుకుంటూ పై కోర్టు నందు దాఖలు చేసుకున్న పై పిటీషను తే: 01.10.2024నకు వాయిదా అయివున్నది. కావునా మీరు ఆరోజు ఉదయం 10.30 గం॥లకు పైకోర్టు నందు ప్రత్యక్షంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపనలు తెలుపుకోగలరు. అట్లా మీరు హాజరు కాని ఎడల పై కేసు మీ పరోక్షముకు నిర్ణయించటం జరుగునని తెలియచేయడమైనది.
శ్రీ బండి వరప్రసాదరావు
శ్రీమతి బండి కనకదుర్గ
హైదరాబాద్ కె.వి.శేఖర్
తే:- 22.09.2024 (పిటీషనర్ తరపు న్యాయవాదులు)

సాంకేతిక పరిజ్ఞానంతో మరమ్మతులు పూర్తి చేయాలి

- పాలేరు రిజర్వాయర్ కాలువ గండ్ల వద్ద రైతుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ కింది భాగంలో సాగర్ ఎడమ కాల్వకు పడ్డ గండ్లను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మరమ్మతులు వెంటనే పూర్తి చేసి రెండు లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోకుండా కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు సాగర్ ఎడమ కాల్వకు గండ్లు పడగా వాటికి మరమ్మతులు చేసినా మళ్లీ శనివారం గండి పడింది. దాంతో గండి పడిన ప్రదేశంలో సిపిఎం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ మాట్లాడారు. ఆగస్టు 31, సెప్టెంబర్1 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షాలకు సాగర్ ఎడమ కాలువకు గండ్లు పడినా అధికారులు సకాలంలో స్పందించి దెబ్బతిన్న విషయం అంచనా వేయకపోవడం వల్ల మరమ్మతులు ఆలస్యంగా మొదలు పెట్టారన్నారు. అలస్యంగా పనులు ప్రారంభం చేయడంతో పాటు హడావుడి పనులు పూర్తి చేసి సాగర్ జలాలు విడుదల చేయడంతో తిరిగి అక్కడే మళ్లీ గండి పడిందని తెలిపారు. దీనిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రితో సహా జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు స్పందించాలని డిమాండ్ చేశారు. గండ్ల మరమ్మత్తు పనులను మంత్రులు, జిల్లా ఉన్నత అధికారులు పర్యవేక్షించకపోవడంతో నాణ్యతా లోపంతో రెండవ సారి గండి పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు నష్టం జరగకుండా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, ఉపాధ్యక్షులు తాతా భాస్కర్ రావు, చింతనిప్పు చలపతిరావు వాసిరెడ్డి ప్రసాద్, గోడవర్తి నాగేశ్వరరావు, ఎస్‌కె మీరా, పార్టీ మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షులు తోటకూర రాజు, కార్యదర్శి బిక్కసాని గంగాధర్, జిల్లా నాయకులు, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యురాలజీ వైద్యవిధానాలపై 'యశోద'లో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో
కిడ్నీ సంబంధ వ్యాధులకు చికిత్సలో లాపరోస్కోపిక్ నుండి రోబోటిక్ సహాయక సర్జరీల వరకు అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్యవిధానాలపై యశోద ఆస్పత్రిలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ లైవ్ వర్క్ షాప్‌లో యూరాలజీ వైద్యరంగంలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతిక పురోగతిని అగ్రశ్రేణి జాతీయ యూరాలజిస్టులు వివారించారు. లైవ్ ఆపరేటివ్ సెషన్‌లు, ప్యానెల్ డిస్కషన్‌లు, వర్చువల్ ట్రైనింగ్ మాడ్యూల్స్, ఆధునిక యూరాలజికల్ ఇన్‌స్ట్రుమెంట్ల హ్యాండ్-ఆన్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ సీనియర్ యూరాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, డాక్టర్ గుత్తా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ సదస్సులో పీడియాట్రిక్ యూరాలజీ, యూరో-ఆంకాలజీ, రీకన్‌స్ట్రక్టివ్ యూరాలజీ, రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో ఆవిష్కరణలను వివరించారు. లాపరోస్కోపిక్ సింపుల్ నెఫ్రెక్టమీ, రెట్రో-పెరిటోనియోస్కోపిక్ నెఫ్రెక్టమీ, అడ్రినలెక్టమీ, రోబోటిక్ ప్రోస్టేటెక్టమీ వంటి అనేక రకాల ప్రత్యక్ష శస్త్రచికిత్సల గురుంచి ఆయన చెప్పారు. ప్రొఫెసర్ డాక్టర్. అనంత్ కుమార్ మాట్లాడుతూ.. లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జరీలు యూరాలజీలో విప్లవాత్మక మార్పులు చేస్తున్నాయని, రోగులకు మరింత ఖచ్చితత్వం, మెరుగైన ఫలితాలను అందిస్తున్నాయని అన్నారు.

IN THE COURT OF THE HON'BLE VI ADDL DISTRICT AND SESSIONS JUDGE -CUM- ADDITIONAL FAMILY COURT JUDGE , RANGA REDDY DISTRICT AT :KUKATPALLY
O.P. No. 2333 OF 2018
Between:
Jaligam Ramulu ...Petitioner
and
Jaligam Lakshmi ...Respondent
To
Smt JALIGAM LAKSHMI, W/o J. Ramulu, Aged 32 years, Occ: House wife, C/o Upparapalli Sattavva, Dobi, Pedasamudrala Village, Koida Mandal, Siddipet District.
PUBLICATION OF NOTICE AS PER COURT DIRECTION
NOTICE
Please take notice that the above petition filed by above Petitioner against you for divorce is posted to 01.10.2024 for your appearance. Hence you are hereby required to appear before the above court on that day at 10.30 am either personally or through your counsel and submit your answers if any. If you fail to appear on that day the matter will be decided in your absence.
This paper publication was given by the orders of the Hon'ble Court.
Sri Bandi Varaprasada Rao,
Smt Bandi Kanaka Durga
Hyderabad, Sri K.V. Sekhar
Date: 22.09.2024 (Counsels for Petitioner)

లెప్రసీ సర్వే డబ్బులేవీ?

- ఇచ్చామంటున్న వైద్యారోగ్యశాఖ
- రాలేదంటున్న డిఎం అండ్ హెచ్ఒలు
- ఆందోళనకు సిద్ధమవుతున్న ఆశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుష్టు వ్యాధి రోగులను గుర్తించేందుకు ఆశాలు రెండు సార్లు సర్వే చేశారు. ఇందు కోసం రావాల్సిన నిధుల విషయంలో సందిగ్ధం నెలకొంది. నిధులను ఆయా జిల్లాలకు విడుదల చేశామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖాధికారులు చెబుతుంటే.. సదరు నిధులు తమకు రాలేదని జిల్లా అధికారులు చెబుతున్నారు. దాంతో సర్వే చేసిన ఆశా కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసిన యూనియన్లు ఆందోళనకు రెడీ అవుతున్నాయి.

క్షేత్రస్థాయిలో విధులు

ఆశాలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించి లెప్రసీ సర్వే చేశారు. అత్యవసరమైతే తప్ప సెలవు తీసుకోరాదనీ, సర్వేలో కచ్చితంగా పాల్గొనాలనీ, పకడ్బందీగా చేయాలనీ, ఎక్కడ తప్పులు దొరదొర్లినా చర్యలు తీసుకుంటామనీ, నిర్దిష్ట ఫార్మెట్, నిర్దిష్ట కాలంలో సర్వే పూర్తి చేయాలని సర్కార్ ఆశాలకు అనేక కఠిన నిబంధనలను విధించింది. అయినా ఆశాలు వారి విధులను వారు సమర్ధంతంగా నిర్వర్తించి తక్కువ సమయంలోనే సర్వే పూర్తి చేశారు. ఇంత నిబద్ధతతో పని చేసినా.. డబ్బుల చెల్లింపులో మాత్రం సందిగ్ధం నెలకొంది. సర్వేలో పాల్గొన్న ఒక్కో ఆశాకు రెండుసార్లకు కలిపి దాదాపు రూ.2,800 వరకు రావాల్సి ఉన్నా నేటికీ అందలేదు. జిల్లాలకు ఇచ్చామని వైద్య, ఆరోగ్యశాఖ చెబుతుంటే.. తమకు డబ్బులు రాలేదనీ, కేవలం వర్క్ ఆర్డర్ మాత్రమే వచ్చిందని డిఎంఅండ్‌హెచ్ఓలు చెబుతున్నారు.

రెండుసార్లు సర్వే

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో కుష్టు రోగులను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేపట్టారు.

సర్వే చేస్తున్న ఆశా వర్కర్లు

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 2023లో ఆగస్టు 18 నుంచి 31వ తేదీ వరకు 13 రోజులపాటు మొదటి సర్వే జరిగింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 26,673 మంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అన్ని ఖర్చులు కలుపుకుని ఒక్కో ఆశా కార్యకర్తకు రూ.1,407 చొప్పున చెల్లించడానికి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం రూ.3,75,47,050 నిధులను కేటాయిస్తూ కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులు 2023 జులై 17వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. అంటే సర్వేకు ముందుగానే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఏడాది మార్చి 11 నుంచి 24వ తేదీ వరకు రెండోసారి సర్వే జరిగింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 28,160 మంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.1,400 చొప్పున చెల్లించడానికి రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,94,24,100 నిధులు కేటాయిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం చూస్తే.. సర్వేకు ముందుగానే రెండు సార్లు నిధుల కేటాయింపులు జరిగినట్టు తెలుస్తోంది. ఆ మేరకు ఆయా జిల్లాల వారీగా సర్వేలో పాల్గొనే ఆశా కార్యకర్త, వారికి చెల్లింపులు, అవసరమైన నిధుల వంటి పూర్తి వివరాలను పేర్కొంటూ జిల్లా వైద్యాధికారులకు ఉత్తర్వులు వచ్చాయి.

ఇందులో భాగంగానే హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనూ రెండు సర్వేలు జరిగాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొదటిసారి జరిగిన సర్వేలో 299 మంది ఆశాలు పాల్గొన్నారు. వీరి కోసం రూ.4,20,693 నిధులు కేటాయించారు. రెండో సర్వేలో 1,273 మంది ఆశాలు పాల్గొన్నారు. వీరికి కోసం రూ.17,82,200 కేటాయించారు. హైదరాబాద్ జిల్లాలో రెండు సర్వేల్లో 1,913 మంది ఆశాలు సర్వేలో పాల్గొన్నారు. వీరి కోసం రూ.25,35,450 కేటాయించారు. కానీ ఇప్పటి వరకు ఈ డబ్బులు ఆశాలకు అందకపోవడం గమనార్హం.

ఆశాలకు అన్యాయం

- వెంకటేశ్, సిఐటియు, సెంట్రల్ సిటీ కార్యదర్శి

కష్టపడి పని చేసిన ఆశాలకు వైద్య, ఆరోగ్యశాఖ, డిఎం అండ్ హెచ్ఒలు అన్యాయం చేస్తున్నారు. లెప్రసీ సర్వే డబ్బులు ఇచ్చామని హెల్త్ కమిషనర్ చెబుతుంటే.. డిఎం అండ్ హెచ్ఒ మాత్రం తమకు రాలేదని చెబుతున్నారు. ఇద్దరిలో ఎవరు చెప్పింది నిజం అనుకోవాలి. మొత్తానికి ఆశాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కొన్ని జిల్లాల్లో ఇచ్చి మరికొన్ని జిల్లాల్లో ఇవ్వకపోడం ఏమిటి..? సరైన సమాధానం రావడం లేదు. ఇప్పటికైనా స్పందించి ఆశాలకు రావాల్సిన సర్వే డబ్బులను వెంటనే చెల్లించాలి.

ఫిక్సిడ్ వేతనం అమలు చేయాలి

- ఉన్నికృష్ణ, సిఐటియు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి

ఆశాలకు 20 పనులకు పారితోషికం ఇస్తూ 40-45 రకాల పనులు చేయిస్తున్నారు. దారుణమైన ఈ పద్ధతిని ఆపి వెంటనే ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి. 2023-24లో చేసిన లెప్రసీ సర్వే డబ్బులను ఇప్పటి వరకు ఇవ్వకపోవడం అన్యాయం. వెంటనే చెల్లించాలి. ఇలాంటి సర్వేలకు సంబంధించిన గతంలోనూ చాలా వరకు డబ్బులు రావాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. లేదంటే ఆందోళనలకు రెడీ అవుతాం.

కొణిదెల చిరంజీవికి సిఎం అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ సినీ నటుడు కొణిదెల చిరంజీవికి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో చోటు దక్కడం తెలుగువారంతా గర్వించదగ్గ విషయమని సిఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. ఈ శుభసందర్భంలో చిరంజీవికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. తెలుగు చలనచిత్ర ప్రముఖ నటులు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవికి గిన్నీస్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం పట్ల టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వందలాది సినిమాల్లో అత్యుత్తమ నటనను ప్రదర్శించి మంచి డ్యాన్స్, ఫైట్స్ పర్ఫార్మెన్స్ చేసిన చిరంజీవికి గిన్నీస్ బుక్ గుర్తించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

లడ్డు కల్తీపై విచారణ జరపాలి

- టిపిసిసి కార్యనిర్వాహణ అధ్యక్షులు జగ్గారెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తిరుమల, తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయ లడ్డు కల్తీపై విచారణ చేపట్టాలని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. దానిపై విచారణ జరపాలంటూ మాజీ సీఎం జగన్ అంటున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ, విదేశాల్లో ఉన్న భక్తులు ఇప్పుడు లడ్డు తినాలా? వద్దా? అనే ఆందోళనలో ఉన్నారని తెలిపారు. వైసిపి, టిడిపి రాజకీయ గొడవల్లో శ్రీవారి ఆలయ ప్రసాదాన్ని అప్రతిష్టపాలు చేయొద్దని కోరారు. లడ్డు కల్తీకి కారణమైన వారిపై దోషులను శిక్షించాలని కోరారు. ఆలయ లడ్డు విశిష్టతను కాపాడేందుకు అధికార టిడిపి, ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలు దృష్టి సారించాలని కోరారు.

పూడూరులో రాడార్ స్టేషన్ నిర్మాణంపై ప్రభుత్వం పునరాలోచించాలి : తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా పూడూరు సమీపంలోని దామగుండం అటవీ ప్రాంతంలో రాడార్ స్టేషన్ నిర్మాణంపై ప్రభుత్వం పునరాలోచించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు మూడు వేల ఎకరాలను రాడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. రాడార్ నిర్మాణం చేయటం అవసరమైనప్పటికీ ఆ ప్రాంతంలో లక్షల సంఖ్యలో వృక్షాలతో పాటు వన్యప్రాణులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. మూసీ నది ప్రారంభమైన ఈ జిల్లాలో నీటితో పాటు జీవ వైవిధ్యానికి, పర్యావరణానికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. పర్యావరణానికి నష్టం జరగకుండా ఇతర ప్రాంతాల్లో రాడార్ స్టేషన్‌ను నిర్మించాలనీ, ఆ దిశగా ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

పర్యాటక ప్రాంతాలు సందర్శించండి

- యువతకు మంత్రి జూపల్లి పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల ప్రమోషన్‌లో భాగస్వాములు కావాలని ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు యువతకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పర్యాటక వారోత్సవాల్లో భాగంగా బుద్ధవనం థీమ్ పార్కుకు ప్రచారం కల్పించేందుకు చేపట్టిన "రైడ్ టూ నిర్వాణ బైక్ ర్యాలీ"ని ఆదివారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి టూరిజం ప్లాజా నుంచి తార్నాక వరకు బైక్ నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జున సాగర్ వద్ద ముగిసే ఈ ర్యాలీ ద్వారా తెలంగాణ టూరిజాన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. చారిత్రక, వారసత్వ కట్టడాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, వన్య ప్రాణులు, సాహస కార్యకలాపాలకు అనువైన ఎన్నో ప్రాంతాలు తెలంగాణలో ఉన్నాయనీ, వాటిని సందర్శించి ప్రాచుర్యం కల్పించాలని కోరారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధ క్షేత్రమైన నాగార్జున కొండ చరిత్ర, బౌద్ధ వారసత్వాన్ని ఈ తరానికి తెలియజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండి ప్రకాష్‌రెడ్డి, పురావస్తు పరిశోధకులు ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు అవగాహన లేదు

మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అవగాహన లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం పొన్నం చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు తామే పూర్తి చేశావని గొప్పలు చెప్పకోవడం మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో వివక్షకు గురైన ఎల్లంపల్లి ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బాగంగా ఎల్లంపల్లిని కీలకమైన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చిన తర్వాతే జలాశయం మీద ఆధారపడిన అన్ని ప్రాంతాలకు నీటిని అందించే పని ప్రారంభం అయ్యిందని పేర్కొన్నారు. ఇదంతా తెలంగాణ ఏర్పడ్డ తర్వాతనే జరిగిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కుంగిపోయినట్టు, పెద్ద ఎత్తున ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. గత నాలుగేండ్లలో ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 20,33,572 ఎకరాలకు (కొత్త, స్థిరీకరణ) సాగునీరు అందిందని మంత్రి ఉత్తం అసెంబ్లీ వేదికగా ప్రకటించారని అన్నారు. ఇది అబద్ధమైతే, శాసన సభ్యులను తప్పుదోవ పట్టించినందుకు ఆయన మీద ప్రివిలేజ్ మోషన్ పెట్టవలసి వస్తుందని హెచ్చరించారు. కాళేశ్వరం ఉపయోగం ఏమిటో రైతాంగానికి, ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు మాని వాస్తవాలు ప్రజలకు చెప్పాలని సూచించారు.

సింగరేణి మైనింగ్ ఉద్యోగాల కీలో తప్పులు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

సింగరేణి సంస్థలో మైనింగ్ ఉద్యోగాల విషయంలో మేనేజ్‌మెంట్ ట్రయినీ పరీక్షలు రాసిన నిరుద్యోగ యువకులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సామాజిక కార్యకర్త లావణ్య రాజు తెలిపారు. మహిళా రిజర్వేషన్, కీలో తప్పుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తరువాత మేనేజ్‌మెంట్ ట్రయినీ మైనింగ్ ఉద్యోగాల భర్తీకి గత మార్చి నెలలో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, పరీక్షల నిర్వహణ బాధ్యతను సింగరేణి యాజమాన్యం డిసిఐఎల్ సంస్థకు అప్పగించిందని తెలిపారు. గత నెల జులై 21న పరీక్ష నిర్వహించగా ఈ నెల 7న ప్రశ్నా పత్రాల కీ విడుదల చేశారన్నారు. అయితే ఇది తప్పుల తడకగా ఉందని పేర్కొన్నారు. తప్పొప్పులపై అభ్యంతాలను తెలియజేయాలని సూచించడంతో ఈ నెల 10న హైదరాబాద్‌లోని సిఎండి బలరామ్‌ను కలిసి తప్పులను వివరించామని, సరిచేయాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. వాటిని సరిచేయకుండానే ఈ నెల 17న ఫైనల్ లిస్టు విడుదల చేశారని తెలిపారు. అందులోనూ పలు తప్పులు ఉన్నారని పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద మైనింగ్ సంస్థ అయినా కోల్ ఇండియాలో కూడా మేనేజ్‌మెంట్ ట్రయినీ మైనింగ్ ఉద్యోగాలకు సంబంధించి మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ లేదని, సింగరేణి సంస్థలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. మహిళలకు హారిజంటల్ రిజర్వేషన్ కల్పించడం వల్ల మొత్తం 139 పోస్టులకుగాను మహిళలకు 44 పోస్టులు దక్కాయన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతోపాటు ఫైనల్ కీలో కొన్ని తప్పులు దొర్లడం వల్ల నిరుద్యోగ యువకులు భారీగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మరికొన్ని ఖాళీలను ఈ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో కలిపి ప్రతిభావంతులైన నిరుద్యోగ అభ్యర్థులకు అన్యాయం జరగకుండా చూడాలని, పోస్టుల సంఖ్యను పెంచాలని కోరారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో మలుపులు

- ధ్వంసం చేసిన ట్యాపింగ్ వివరాలపై సీరియస్
- దృష్టి సారించిన స్పెషల్ టీం
- 4500 ఫోన్లను ట్యాప్ చేసిన ప్రణీత్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డిఎస్‌పి ప్రణీత్‌రావు ధ్వంసం చేసిన ట్యాపింగ్ వివరాలపై పంజాగుట్ట స్పెషల్ టీం అధికారులు ప్రత్యేకంగా దృష్టిని సారించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష కీలక కాంగ్రెస్ నాయకుల ఫోన్లతో పాటు మరికొందరు ప్రముఖుల ఫోన్లను గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎస్ఐబి అధికారులు ట్యాపింగ్‌కు పాల్పడటం సంచలనం రేపిన విషయం విదితమే. ఈ నేరంపై కేసును సీరియస్ అయిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు కోసం స్పెషల్ టీంను ఏర్పాటు చేసి రంగంలోకి దించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటి వరకు ఎస్ఐబీ డిఎస్‌పి ప్రణీత్‌రావు, నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీలు బుజంగరావు, తిరుపతన్నలను స్పెషల్ టీం అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాగా, వారి విచారణలో అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు తాము ఫోన్ ట్యాపింగ్‌ను జరిపినట్టు అరెస్టయిన నిందిత అధికారులు వాంగ్మూలమిచ్చారు. అయితే, ఇందులో అదనపు ఎస్‌పి బుజంగరావుకు మాత్రం మధ్యంతర బెయిల్ లభించగా, మిగతావారు జైలులోనే ఉన్నారు. కాగా, ఈ కేసు వెలుగు చూసే కొద్దిరోజుల ముందు ఐపిఎస్ అధికారి ప్రభాకర్‌రావుతో పాటు మరో నిందితుడైన ఐ న్యూస్ సిఇఒ శ్రవణ్ కుమార్‌లు దేశం విడిచి వెళ్లారు. తాను క్యాన్సర్ చికిత్స కోసం అమెరికాకు వెళ్లాననీ, చికిత్స ముగించుకొని వస్తానంటూ ప్రభాకర్‌రావు ఇక్కడి అధికారులకు సమాచారమందించారు. అయితే, ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్‌ల కోసం కోర్టు అనుమతితో రెడ్‌కార్నర్ నోటీసును నగర పోలీసు కమిషనర్ తరఫున సిఐడి అధికారులు జారీ చేశారు. ఆ ప్రక్రియ సిబిఐ ద్వారా ఇంటర్‌పోల్‌కు చేరి ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్‌లను తీసుకొచ్చే ప్రక్రియ సాగుతున్నట్టు అధికార వర్గాలు చెప్తున్నాయి.

ప్రణీత్‌రావు గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 4500 ఫోన్లను రహస్యంగా ట్యాపింగ్ చేసినట్టు స్పెషల్ టీం అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. అంతేగాక, ప్రధానంగా ప్రస్తుత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబీకులతో పాటు పలువురు కాంగ్రెస్ కీలక నేతల ఫోన్లను ట్యాపింగ్ జరిపి, వారి కదలికలు, రాజకీయ ఎత్తుగడలను ఎప్పటికప్పుడు ఎస్ఐబీ చీఫ్‌కు సమాచారమందించినట్టు కూడా దర్యాప్తులో వెలుగు చూసింది. 198 మందికి పైగా కాంగ్రెస్ నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేశారనీ, ఆయన ట్యాపింగ్ చేసిన ఫోన్లన్నీ ఎయిర్టెల్ నెట్వర్క్‌కు చెందినవని స్పెషల్ టీం అధికారులు తెల్చారు. తాము జరిపిన ఫోన్ ట్యాపింగ్‌ల గుట్టు రట్టవటంతో ఎన్నికల ఫలితాలు వచ్చే ఒక రోజు ముందు ఎస్ఐబి ఆఫీసులో తాము ట్యాపింగ్ కోసం ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక గదిలోని సాంకేతిక పరికరాలు, హార్డ్ డిస్క్‌లను ప్రణీత్‌రావు ధ్వంసం చేశాడని బయటపడింది. దాదాపు 328 జి.బి మేర తాము సేకరించిన సమాచారాన్ని ధ్వంసం చేసినట్టు తేలింది. అయితే, ప్రస్తుత దర్యాప్తులో అత్యంత కీలకమైన ఆ సమాచారాన్ని తిరిగి సేకరించటానికి స్పెషల్ టీం అధికారులు ప్రత్యేకంగా దృష్టిని సారించినట్టు తెలిసింది. ఈ విషయమై కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్న జూబ్లిహిల్స్ ఏసీపీ వెంకటగిరి తన సీనియర్ పోలీసు అధికారులతో చర్చించినట్టు సమాచారం. అలాగే, ఈ కేసులో ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు అంశాలను నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్‌కు సైతం దర్యాప్తు అధికారులు విశదీకరించినట్టు తెలిసింది.

ఐటి కారిడార్‌లో భారీ చోరీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ శివారు పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. మక్త గ్రామంలోని నాగభూషణం అనే వ్యక్తి ఇంట్లో రూ.2కోట్లకు పైగా నగదును దుండగులు చోరీ చేశారు. ఇంటి తాళాలను పగులగొట్టి బీరువాలో ఉంచిన నోట్ల కట్టలను ఎత్తుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి విచారణ చేపట్టారు.

పోలీసుల దర్యాప్తులో వెల్లడైన ప్రకారం.. నాగభూషణం ఇటీవల శంకర్‌పల్లిలో 10 ఎకరాల భూమి విక్రయానికి ఒప్పందం చేసుకున్నారు. కొనుగోలుదారులు అడ్వాన్స్‌గా రూ.2కోట్ల 2లక్షల నగదు ఇవ్వడంతో ఇంట్లో ఉంచారు. ఆ నగదుతో పాటు 28 తులాల బంగారు నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. నాగభూషణం వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై అనుమానంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ప్రపంచ కమ్యూనిస్టు మేధావి సీతారాం ఏచూరి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే వారికి నిజమైన నివాళి
- ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి

ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ కమ్యూనిస్టు మేధావి సీతారాం ఏచూరి అని, ఆయన దేశానికి చేసిన సేవలతోనే ప్రపంచ గుర్తింపు లభించిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. సిపిఎం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సీతారాం ఏచూరి సంస్మరణ సభకు ఆయన హాజరై మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి నేతగా 1974లో సీతారాం ఏచూరి రాజకీయ ప్రస్థానం మొదలైందన్నారు. 1975లో సిపిఎంలో చేరారని, జెఎన్‌యు స్టూడెంట్స్ యూనియన్‌కు మూడుసార్లు అధ్యక్షునిగా ఎన్నికయ్యారని చెప్పారు. సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్‌తో కలిసి జెఎన్‌యును వామపక్ష కోటగా మార్చారన్నారు. 2015లో విశాఖపట్నంలో జరిగిన 21వ సిపిఎం మహాసభల్లో పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయిన ఏచూరి.. మరణించేవరకూ ఆ పదవిలో కొనసాగుతున్నారని చెప్పారు. ప్రజాసమస్యలు, ఇతర అంశాలపై గళం విప్పుతూ.. రాజ్యసభలో ఏచూరి గుర్తింపు పొందారన్నారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం 'కామన్ మినిమమ్ ప్రోగ్రామ్' ముసాయిదాను రూపొందించడంలో ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయసాధన కోసం పార్టీలో ప్రతి కార్యకర్త ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాదం పెరుగుతున్న తరుణంలో ఇలాంటి కమ్యూనిస్టు మేధావిని కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. ఆయనకు నిజమైన నివాళి ఉన్మాదంపై పోరాటం చేయడమేనని తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు వినయ్ కుమార్ మాట్లాడుతూ.. లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటం కోసం ఆయన స్ఫూర్తితో మనందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సభకు ముందుగా చెరుపల్లి, వినయకుమార్, జిల్లెల చిన్నారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ప్రజా వైద్యశాల డాక్టర్ మురళీధర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, టిజెఎసి జిల్లా అధ్యక్షులు ఖాదర్బాషా, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఆనంద్, కట్ట నర్సింహ, రాష్ట్ర నాయకులు కాకం ఆంజనేయులు, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుట్ట ఆంజనేయులు, లక్ష్మి, బాల్‌రెడ్డి, మేకల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానిత ఐసిస్ ఉగ్రవాదిని విచారించిన ఎన్ఐఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పుణేలో విధ్వంసానికి పాల్పడి పెద్ద ఎత్తున మత విద్వేషాలను రగల్చటానికి ప్రయత్నించిన ఐసిస్ ఉగ్రవాది రిజ్వాన్ అబ్దుల్లాను ఎన్ఐఏ అధికారులు ఆదివారం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. సైదాబాద్‌లోని గ్రీన్‌వ్యూ అపార్ట్‌మెంట్‌లో గతంలో ఉగ్రవాది బస చేసిన ఫ్లాట్‌లో రిజ్వాన్‌ను ఎన్ఐఏ అధికారులు విచారించారు. పుణేలో తాము పన్నిన విధ్వంస వ్యూహాన్ని అమలు చేయటానికి రిజ్వాన్ ఈ అపార్ట్‌మెంట్ నుంచే స్కెచ్ వేసినట్టు ఎన్ఐఏ అధికారులకు దర్యాప్తులో వెల్లడైంది. దాదాపు మూడు నెలల పాటు ఈ ఫ్లాట్‌లో ఉన్న రిజ్వాన్.. అక్కడ ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడు కాడనీ, ఎప్పుడూ తలుపులు మూసుకొని లోపల ఉండేవాడనీ, అవసరమైతే తప్ప వెలుపలికి వచ్చేవాడు కాదని ఇతర అపార్ట్‌మెంట్‌వాసుల నుంచి దర్యాప్తు అధికారులు సమాచారాన్ని సేకరించినట్టు తెలిసింది. అయితే, రిజ్వాన్‌కు అక్కడ ఫ్లాట్‌ను ఎవరు ఇప్పించారు? ఆయన ఆపరేషన్‌కు అవసరమైన డబ్బులను ఎవరు సమకూర్చారు? ఇంకా ఎంత మందితో హైదరాబాద్‌లో రిజ్వాన్ నెట్వర్క్‌ను ఏర్పర్చుకున్నాడు? రిజ్వాన్‌తో సన్నిహితంగా మెలిగినవారెవరు? తదితర కోణాల నుంచి ఎన్ఐఏ అధికారులు క్షుణ్ణంగా దర్యాప్తు జరుపుతున్నారు. పుణేలో ఉగ్రకుట్రకు పాల్పడ్డ రిజ్వాన్‌ను ఇటీవలే ఢిల్లీలో ఎన్ఐఎ అధికారులు ఢిల్లీలో అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఈ ఉగ్రవాది నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలను కూడా ఆ సమయంలో స్వాధీనపర్చుకున్నారు.

సింగరేణి కార్మికులను దగా చేసిన కాంగ్రెస్

- ప్రకటించింది దసరా బోనస్ కాదు... బోగస్
- టెండర్ల అక్రమాలపై విచారణకు సిద్ధం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం దగా చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బోనస్ విషయంలో అంకెల గారడి చేసి కార్మికులను మోసం చేశారని విమర్శించారు. డిప్యూటీ సిఎం భట్టి, సిఎం రేవంత్ చెప్పిన మాటలకు పొంతన లేకుండా ఉందని అన్నారు. "1999 నుంచి 2004 వరకు టిడిపి, 2004 నుంచి 2014 వరకు పదేళ్ల పాటు కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉంది. పదేళ్ల కాంగ్రెస్ పాలనలో సింగరేణి కార్మికులకు 11 నుంచి 20 శాతం వరకు బోనస్‌ను పెంచి మొత్తం రూ.370 కోట్లు ఇచ్చింది. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది 2014లో సింగరేణి రూ.1,060 కోట్ల లాభాలను ఆర్జించింది. అందులో 21 శాతం బోనస్‌గా ప్రకటించగా వచ్చిన రూ.102 కోట్లను ఒక్కో కార్మికునికి రూ.17 వేలు ఇచ్చాం. 2018-19లో రికార్డు స్థాయిలో లాభాలు వచ్చాయి. ఆ ఏడాది ఒక్కో కార్మికుడికి రూ.లక్ష చెల్లించాం. 2023లో రూ.2,222 కోట్ల లాభాల్లో రూ.1.60 లక్షలు బోనస్‌గా అందజేశాం. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో 60,369 మంది సింగరేణి కార్మికులకు రూ.2,780 కోట్ల లాభాల బోనస్ ఇచ్చాం. కాని దానికి భిన్నంగా కాంగ్రెస్ సర్కార్ కార్మికులను మోసం చేసింది. డిప్యూటీ సిఎం చెప్పిన లెక్కల ప్రకారం ఈ ఏడాది సింగరేణి రూ.4,701 కోట్ల లాభాలను గడించింది. అందులో 33 శాతం వాటా (రూ.1,551కోట్లు) కార్మికులకు ఇచ్చామన్నారు. కార్మికులకు 33 శాతం వాటా ఇస్తే ఒక్కొక్కరికి రూ.3.70 లక్షల లాభం రావాలి. కానీ ప్రభుత్వం రూ.1.90 లక్షలు మాత్రమే బోనస్‌గా ప్రకటించింది. ఈ లెక్క ప్రకారం చూస్తే కేవలం 16.2 శాతం లాభాల్లో వాటాగా ఇచ్చి, 33 శాతం అని మభ్యపెడుతున్నారు. ఇది ముమ్మాటికి కార్మికులను దగా చేయడమే అవుతుంది. దీనిపై సిఎం నేరుగా సమాధానం చెప్పాలి" అని కెటిఆర్ డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సింగరేణిని ప్రయివేటీకరణ చేయాలని చూస్తోందని, కాంగ్రెస్ దానికి సహకరిస్తోందని ఆరోపించారు. సింగరేణి లాభాల వాటాపై కార్మికులు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.. సింగరేణి అధికార గుర్తింపు సంఘం ఎఐటియుసితో పాటు, సిపిఐ, బిజెపి నేతలు ఈ అంశంలో స్పందించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

టెండర్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

అమృత్ టెండర్లపై సిట్టింగ్ జడ్జి, లేదా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌తో విచారణ జరిపించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. శనివారం మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. కేవలం రూ. రెండు కోట్ల లాభం ఉన్న కంపెనీకి రూ.1,000 కోట్ల కాంట్రాక్టు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా జరిగిన తప్పును ఒప్పుకొని జరిగిన టెండర్లను సిఎం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

దోమల నివారణకు చర్యలు

- నీరు, ఆహారం కలుషితమయ్యే అవకాశం
- చికిత్స కోసం అన్ని ఏర్పాట్లు
- డిహెచ్ డాక్టర్ బి రవీందర్ నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎడతెరిపి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రోగాలు ప్రబలే ప్రమాదముందని వైద్యారోగ్యశాఖ హెచ్చరించింది. వ్యాధుల చికిత్సకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రజలు వ్యక్తిగతంగా వ్యాధులు వ్యాప్తి చెందకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాకాలంలో, వర్షాకాలం తర్వాత కొంత కాలం వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని, వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గి, తేమ శాతం పెరడంతో వివిధ రకాల వైరల్ ఇన్‌ఫెక్షన్లు, దోమలతో పాటు ఆహారం, నీరు కలుషితం కారణంగా వచ్చే వ్యాధుల బారిన పడకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

"దోమలు వ్యాపించకుండా మస్కిటో నెట్స్, స్క్రీన్స్ వాడాలని, దోమలు ఎక్కువగా పెరిగే అవకాశమున్న ఉదయం, సాయంత్రం సమయాల్లో తలుపులు, కిటికీలు సరిగ్గా మూసుకోవాలి. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల బారిన పడతారు. 156 రంధ్రాలు కలిగిన మస్కిటో నెట్లను వాడాలి. పిల్లలు తేలికపాటి రంగుల దుస్తులను ధరించాలని, కాళ్లను, చేతులను కూడా కవర్ అయ్యేలా చూసుకోవాలి. బయటికి వెళ్లేటప్పుడు మస్కిటో రీపెల్లెంట్ వంటి క్రీములు, లోషన్స్, బాడీ స్ప్రేలను వాడాలి. రసాయనపూరిత మస్కిటో రీపెల్లెంట్స్‌ను పిల్లలకు దూరంగా ఉంచాలి. నీటి నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి. సెప్టిక్ ట్యాంక్‌లను పూర్తిగా కవర్ చేయాలి. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలి..." అని సూచించారు.

"బయటికి వెళ్లినప్పుడు ఇంటి నుంచి కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలి. తరచుగాచేతులను శుభ్రం చేసుకోవాలి. ముఖ్యంగా బయటి ఆహారం, కోసినవి, సరిగ్గా కవర్ చేయాలని చాట్, సలాడ్స్, ఫ్రూట్స్, జ్యూసెస్‌కు దూరంగా ఉండాలి. ఇంట్లో వండిన తాజా ఆహారాన్ని మాత్రమే భుజించాలి. వ్యాధిబారిన పడిన వారితో చేతులు కలపడం, ఆహారాన్ని పంచుకోవడం, నీరు, వస్త్రాలు పంచుకోవద్దు. బహిరంగ ప్రదేశాలకు వెళ్లినప్పుడు తలుపుల హ్యాండిల్స్, టేబుల్ టాప్స్ వంటి వాటిని తాకకూడదు. తగ్గినప్పుడు ఇతరులకు ఇన్ఫెక్షన్ సోకకుండా మూతిని పూర్తిగా కవర్ చేసుకోవాలి. దగ్గు, తుమ్ములు వచ్చినప్పుడు వాడిపాడేసే టిష్యులను ఉపయోగించాలి. ఎవరైన జ్వరంతో కూడిన దగ్గు, తలనొప్పి, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు, కళ్ల కలక లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలి..." అని డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు.

ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ప్రభుత్వం జ్వరపీడితుల కోసం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక బెడ్లను సిద్ధం చేసినట్టు డిహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. ఇప్పటికే ఆయా ఆస్పత్రుల్లో ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఆస్పత్రికి వ్యాధిగ్రస్తులు చేరుకునేలోపు అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు వీలుగా ఎఎన్ఎం, ఆశాలు, అంగన్ వాడీ వర్కర్ల వద్ద ఒఆర్ఎస్ సాచెట్లను ఉంచినట్టు పేర్కొన్నారు.